


# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

యాదాద్రిభువనగిరి | ఆదివారం 13 సెప్టెంబర్ 2026


## భవిత పిల్లల 'మట్టి' ముచ్చట







- **సృజనాత్మకతతో గణనాథుడి ప్రతిమల తయారీ**
- **పర్యావరణ పరిరక్షణకు ఏకో ఫ్రెండ్లీ వేడుకలు**
- **మట్టి గణపతులతో పండుగ జరుపుకోవాలని విద్యార్థుల పిలుపు**

**తొలివెలుగు, రాజాపేట:** పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా మట్టి గణపతులతో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని రాజాపేట మండల కేంద్రంలోని భవిత కేంద్రం దివ్యాంగ విద్యార్థులు పిలుపునిచ్చారు. శనివారం భవిత కేంద్రంలో విద్యార్థులు తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తూ స్వయంగా మట్టితో వినాయక ప్రతిమలను తయారు చేశారు. మరికొందరు విద్యార్థులు కాగితాలపై రంగురంగుల వినాయకుడి చిత్రాలను అందంగా చిత్రీకరించి ఆకట్టుకున్నారు. మట్టి గణపతుల తయారీతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు తమలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి గణపతి ప్రతిమలను పూజించి, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. దివ్యాంగ విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో, ప్రతిభతో మట్టి గణపతులను తయారు చేయడం అభినందనీయమని కేంద్ర నిర్వాహకురాలు సంధ్యారాణి, కేర్‌గివర్ లక్ష్మి కొనియాడారు. కార్యక్రమంలో భవిత కేంద్రానికి చెందిన పలువురు దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

## కాల్వపల్లిలో తహసీల్దార్ రవికిరణ్ పర్యటన

- **ఓటరు జాబితా సవరణ పనుల పరిశీలన**
- **నోటీసుల జారీ అంశంపై బీఎల్ఓలతో విచారణ**
- **అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి**




**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామాన్ని తహసీల్దార్ గోలి రవికిరణ్ శనివారం సందర్శించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఎస్ఆర్) రెండో దశ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఓటరు జాబితా సవరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లకు జారీ చేసిన నోటీసుల వివరాలు, వాటి పంపిణీ ప్రక్రియ, ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు)ను అడిగి తెలుసుకున్నారు. జాబితాలో పేర్లు, వివరాల సవరణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా పూర్తి పారదర్శకతతో సవరణ ప్రక్రియను నిర్వహించాలని తహసీల్దార్ సూచించారు. నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## నిరుద్యోగులకు సువర్ణావకాశం..

- **19న 'మెగా జాబ్ మేళా'**
- **లక్కారంలో 70కి పైగా కంపెనీలతో నేరుగా ఇంటర్వ్యూలు**
- **10వ తరగతి నుంచి పీజీ, బీటెక్, ఫార్మసీ వరకు అర్హత ఉన్నవారికి అవకాశం**
- **ఉచితంగా పాల్గొనే అవకాశం.. రిజిస్ట్రేషన్‌కు పిలుపు**



తొలివెలుగు, చౌటుప్పల్ : నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 19న లక్కారంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండల పరిధిలోని లక్కారంలోని వీ.వీ.ఆర్ గార్డెన్స్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 70కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, బీటెక్, ఫార్మసీ తదితర విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భాస్కర్ కోరారు. జాబ్ మేళాలో పాల్గొనడానికి ఎలాంటి రుసుము లేదని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 95508 43338 నంబర్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

# గౌడ సంఘం ఉపాధ్యక్షురాలిగా ధనలక్ష్మి

- **నియామక పత్రం అందజేసిన జాతీయ అధ్యక్షుడు గట్టు రాంచంద్రయ్య గౌడ్**
- **మహిళల అభ్యున్నతికి కృషి చేస్తానన్న బీసు ధనలక్ష్మి**



**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం) :** తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా ఆత్మకూరు (ఎం) మండలానికి చెందిన బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు గట్టు రాంచంద్రయ్య గౌడ్ చేతుల మీదుగా ఆమె నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ.. తన సేవలపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ అధ్యక్షుడు రాంచంద్రయ్య గౌడ్‌తో పాటు సంఘం నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో గౌడ మహిళల సంక్షేమానికి, అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తూ.. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వచ్చేలా సమన్వయం చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండాల మల్లేష్ గౌడ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్ గౌడ్, ఆత్మకూరు (ఎం) మండల మహిళా విభాగం అధ్యక్షురాలు పొన్నగాని జయశ్రీ జహంగీర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ధ్యాన్ ఫౌండేషన్ గోశాలను పరిశీలించిన 'ఆత్మ' ఛైర్మన్


- **రైతులకు వర్మీ కంపోస్ట్ తయారీకి పేడ సేకరించాలి**
- **నిర్వాహకులు, అధికారులతో మాట్లాడిన ఎనగండ్ల సుధాకర్**



**తొలివెలుగు, రాజాపేట:** మండలంలోని చల్లూరు గ్రామ సమీపంలో ఉన్న ధ్యాన్ ఫౌండేషన్ గోశాలను ఆత్మ కమిటీ జిల్లా ఛైర్మన్ ఎనగండ్ల సుధాకర్ శనివారం సందర్శించారు. గోశాల నిర్వాహకురాలు పూనమ్ కపూర్‌తో మాట్లాడి అక్కడ పశువుల సంరక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశు వైద్యాధికారి డాక్టర్ కె.భాస్కర్, పశువైద్య గణాంకాధికారి పెండెం శ్రీనివాస్‌లతో పశువుల ఆరోగ్యం, అందుతున్న వైద్య సేవలపై చర్చించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా రైతులకు వర్మీ కంపోస్ట్ తయారీకి అవసరమైన పేడను సేకరించి అందించాలని గోశాల నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్, నాయకులు ప్రశాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన వేముల వీరేశం

- **హయత్‌నగర్‌లో కదిరె కృష్ణ కుమారుడి వివాహ వేడుకకు హాజరు**
- **నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్**
- **దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్ష**



**తొలివెలుగు, హైదరాబాద్ :** హయత్‌నగర్‌లో జరిగిన కదిరె కృష్ణ కుమారుడి వివాహ వేడుకకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరయ్యారు. వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన వేముల వీరేశం.. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కొత్త జీవితంలో అన్యోన్యతతో ముందుకు సాగుతూ కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. వివాహ వేడుకకు ఎమ్మెల్యే హాజరు కావడంతో కదిరె కృష్ణ కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు సంతోషం వ్యక్తం చేశారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## వర్తక సంఘం అధ్యక్ష పదవికి

# మాధవులు రాజీనామా

**వ్యక్తిగత కారణాలతో నిర్ణయం..**
**కార్యవర్గానికి రాజీనామా లేఖ సమర్పణ**



**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో దుకాణాల యజమానులు ఏర్పాటు చేసుకున్న వర్తక వెల్ఫేర్ సంక్షేమ సంఘం అధ్యక్ష పదవికి గడ్డమీది మాధవులు రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం తన రాజీనామా లేఖను సంఘ కార్యవర్గానికి సమర్పించారు. గత రెండేళ్లకు పైగా సంఘ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన మాధవులు.. ప్రస్తుతం వ్యక్తిగత కారణాల వల్ల సంఘ కార్యకలాపాలకు తగిన సమయం కేటాయించలేకపోతున్నట్లు రాజీనామా లేఖలో పేర్కొన్నారు. బాధ్యతలు నిర్వర్తించేందుకు సమయం కేటాయించలేకపోతే సంఘానికి అన్యాయం చేసినట్లవుతుందనే ఉద్దేశంతో స్వచ్ఛందంగా అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించి అధ్యక్ష బాధ్యతల నుంచి తనకు ఉపశమనం కల్పించాలని సంఘ కార్యవర్గాన్ని మాధవులు కోరారు.

## హైదరాబాద్ పాతబస్తీలో మహిళా బీఎల్‌ఓపై

# ఎంఐఎం నేత దాడి



**హైదరాబాద్:** హైదరాబాద్ పాతబస్తీలో మహిళా బీఎల్‌ఓ (బూత్ లెవల్ ఆఫీసర్) పై దాడి జరిగింది. ఎంఐఎం పార్టీ నేత హసన్ మహిళపై దాడి చేసి చంపుతానని బెదిరించారు. దీంతో బాధితులురాలు ఐఎస్ సదన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడు నెలల నుండి తాను బీఎల్‌ఓ గా విధులు నిర్వహిస్తున్నానని, తనను చాలా రోజుల నుండి వేధింపులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. నిన్న తనను కొట్టాడని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెబితే తొటి ఉద్యోగి, అధికారి అడ్డుకున్నారని చెప్పింది. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరింది. బాధితురాలికి బీజేపీ నాయకులు అండగా నిలిచారు. సర్ ప్రక్రియను కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఇలాంటి దాడులు జరగకుండా పోలీసులు అధికారులకు రక్షణ కల్పించాలని అన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రెడ్డి సంఘం అధ్యక్షుడిగా రాజిరెడ్డి

- జలాల్‌పురంలో నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
- ప్రధాన కార్యదర్శిగా బండ విగ్నేశ్వర్‌రెడ్డి.. కోశాధికారిగా గంగిడి మాధవరెడ్డి
- నూతన కార్యవర్గానికి గ్రామస్థుల శుభాకాంక్షలు



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** మండల పరిధిలోని జలాల్‌పురం గ్రామంలో రెడ్డి సంఘం సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రెడ్డి సంఘానికి నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోరంటి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కేసారం నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండ విగ్నేశ్వర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా కంది మహేందర్‌రెడ్డి, కోశాధికారిగా గంగిడి మాధవరెడ్డి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జిలకపల్లి సంజీవరెడ్డి, లింగాల శ్రీనివాస్‌రెడ్డి, గంగిడి వెంకటరెడ్డి, బండ అశోక్‌రెడ్డి, పిట్ట వెంకటరెడ్డి, నిమ్మ శ్రీధర్‌రెడ్డి, జిలకపల్లి రంగారెడ్డి, జిలకపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కేసారం సురేందర్‌రెడ్డి, కేసారం శ్రీకాంత్‌రెడ్డి, నక్క శ్రీనివాస్‌రెడ్డి, పిట్ట మధుసూదన్‌రెడ్డి, గోరంటి ప్రదీప్‌రెడ్డి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలని పలువురు సూచించారు. నూతన అధ్యక్షుడు గోరంటి రాజిరెడ్డి, కార్యవర్గ సభ్యులకు గ్రామస్థులు శుభాకాంక్షలు తెలిపారు.

# పాఠశాలకు బెంచీల బహూకరణ

- నిదానపల్లి విద్యార్థులకు వసతులు కల్పించిన నారపాక నరేందర్
- దాత సేవాభావాన్ని కొనియాడిన గ్రామస్తులు
- పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల కృతజ్ఞతలు



**తొలివెలుగు, రామన్నపేట :** మండల పరిధిలోని నిదానపల్లి గ్రామ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం దాత నారపాక నరేందర్ శనివారం 10 బెంచీలను బహూకరించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఆయన ఈ సాయం అందించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని బెంచీలను అందజేసిన నారపాక నరేందర్‌కు ఉపాధ్యాయులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పడేలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నరేందర్ సేవాభావం మరెందరికో స్ఫూర్తిదాయకమని గ్రామస్తులు కొనియాడారు.

# వరుస చోరీల ముఠా గుట్టురట్టు

- నలుగురు నిందితుల అరెస్ట్
- 45 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.75 వేల నగదు స్వాధీనం
- నేరాలకు ఉపయోగించిన డిజైర్ కారు సీజ్




**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట, చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి 45 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.75 వేల నగదుతో పాటు చోరీలకు ఉపయోగించిన షిఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నట్లు రామన్నపేట సీఐ మోలుగూరి రవి, ఎస్ఐ గోపాతి సతీష్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కావడి అలివేలు (45), కర్రెద్దుల మరి యమ్మ (33), కావడి మహంకాళి అలియాస్ లక్ష్మి (39), చౌట భానుప్రసాద్ (24) కలిసి ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

బంగారు ఆభరణాలు ధరించిన మహిళలను లక్ష్యంగా చేసుకుని, వారు ఒంటరిగా ఉన్నప్పుడు లేదా రద్దీ ప్రాంతాల్లో అదును చూసి నగలు అపహరించేవారని పేర్కొన్నారు. ఇటీవల రామన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న నాంపల్లి రామనర్సమ్మ అనే మహిళ మెడలోని 32.5 గ్రాముల మంగళసూత్రాన్ని అపహరించి విక్రయించినట్లు పోలీసులు తెలిపారు.

అలాగే ఈ నెల 4న చౌటుప్పల్‌లో కారులో ఓ మహిళను వెంబడించి చోరీకి పాల్పడినట్లు, 7న చౌటుప్పల్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మరో మహిళ నుంచి నగలు అపహరించినట్లు వివరించారు. నిందితులను విచారించగా మరికొన్ని చోరీలకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి మొత్తం 45 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.75 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నేరాలకు ఉపయోగించిన డిజైర్ కారును సీజ్ చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, సీఐ మోలుగూరి రవి అభినందించారు.

# భేష్.. సంగీతలక్ష్మి

- స్వయంగా మట్టి గణపయ్యను రూపొందించిన విద్యార్థిని
- ఆరో తరగతి బాలిక సృజనాత్మకతకు గ్రామస్థుల ప్రశంసలు
- పర్యావరణ పరిరక్షణపై చాటిన అవగాహన



**తొలివెలుగు, రాజాపేట:** పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ రాజాపేట మండలం పారుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థిని మాడిశెట్టి సంగీతలక్ష్మి అందరి ప్రశంసలు అందుకుంటోంది. వినాయక చవితి వేడుకల్లో భాగంగా తన ఇంట్లో ప్రతిష్ఠించి పూజించేందుకు స్వయంగా మట్టి వినాయకుడి ప్రతిమను తయారు చేసి సృజనాత్మకతను చాటుకుంది. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు, కాలుష్యకారక రంగులకు దూరంగా ఉంటూ మట్టితో అందమైన గణపతి ప్రతిమను రూపొందించింది. చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకుని మట్టి గణపతిని తయారు చేయడం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సంగీతలక్ష్మి రూపొందించిన మట్టి గణపతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ప్రతిభను ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు, పారుపల్లి గ్రామస్థులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

# పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ షెడ్లు

**మీర్‌పేట్ :** బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో అక్రమ షెడ్ల నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమ షెడ్ల నిర్మాణాలకు బడంగ్‌పేట్ సర్కిల్ అడ్డాగా మారిందని, పట్టించుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కుల ఆగడాలు మితిమీరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.



అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తిపడి అక్రమ షెడ్లకు ఆజ్యం పోస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని మారుతినగర్ మందమల్లమ్మ కూడలి వద్ద ప్రధాన రహదారి పక్కనే యథేచ్ఛగా అక్రమ షెడ్డు నిర్మాణం చేపట్టినా అధికారులు అటువైపు చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లెలగూడ లలితానగర్ కూడలి వద్ద హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనకాల భారీ అక్రమ షెడ్డు నిర్మాణం జరుగుతున్నా చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. చర్యలు తీసుకోకపోవడానికి కారణమేంటని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ నిర్మాణం చేపట్టినా మున్సిపల్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అక్రమార్కులు నిబంధనలను తుంగలో తొక్కి ప్రధాన రహదారుల పక్కన పెద్ద ఎత్తున అక్రమ షెడ్ల నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని అంటున్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని అధికారులు చెబుతున్నప్పటికీ, ఆ మాటలు ఆచరణలో కనిపించడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

# బండ తిరుమలయ్య స్వామి ఆలయ పునర్నిర్మాణం



**మక్తల్ :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో అత్యంత ప్రాచీనమైన పవిత్ర క్షేత్రంగా శ్రీ స్వయంభూ శ్రీ బండ తిరుమలయ్య స్వామి దేవాలయం పునర్నిర్మాణంతో హోమాలు, ఆహుతి, ప్రత్యేక పూజలు శనివారం వేద పండితుడు రాఘవేంద్ర చారి, కౌశిక్ జోషి, ఆనంద తీర్థ, శ్యామ సుందరాచారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారు బండపై స్వయంభూ స్వరూపంగా వెలిసినందున స్వామిని భక్తులు ప్రేమతో "బండ తిరుమలయ్య స్వామి" అని పిలుస్తారని స్థానికంగా భక్తుల ప్రతీతి. "తిరుమలయ్య" పేరుతో ప్రసిద్ధి చెందిన కొన్ని క్షేత్రాలలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారు శిల, బండ లేదా గుట్టపై లక్ష్మీ వేంకటేశ్వర స్వామిగా వెలసిన స్వరూపంలో దర్శనమిస్తారని భక్తులలో విశ్వాసం.

దాదాపు 600 సంవత్సరాల కిందట మక్తల్ పట్టణం రూపుదిద్దుకుంటున్నప్పుడు పట్టణం చుట్టూ ప్రహరీ, ఎత్తైన కోట గోడ, మూడు ద్వారాలు, ఆంజనేయ స్వామి రక్షణగా ఆలయాలు నిర్మాణం జరగడం. శత్రువులు లోపలికి ప్రవేశించకుండా కోటగోడ అంతర్భాగంలో కందకాలు, ఆ కందకాలలో ఎప్పుడూ నీళ్లు ఉండేలా పట్టణానికి ఈశాన్యంగా పెద్ద చెరువు, పడమర, దక్షిణం వైపున చెరువులను నిర్మాణం చేశారు. అదే పరంపరలో ఈ ఆలయానికి సమీపంలోని బండ తిరుమలయ్య ప్రస్తుత వెంకటేశ్వర స్వామి చెరువుగా, స్వామివారి పేరున ఏర్పడిన పేరుగా స్థానికంగా తరతరాలుగా చెప్పుకుంటూ వస్తున్నారు.

**క్షేత్ర విశిష్టత.. పూర్వకాలపు మొక్కు సంప్రదాయం : బండరాళ్ల పై భోజనం**

పూర్వకాలంలో భక్తులు స్వామివారిని మొక్కుకుని, ముడుపు కట్టగా, కోరిక నెరవేరిన అనంతరం తిరిగి క్షేత్రానికి వచ్చి మొక్కు తీర్చుకునేవారిని. అనంతరం స్వామివారికి తీపి వంటకాలతో నైవేద్యంగా పెట్టి, ఆలయ ప్రాంగణంలోని సహజసిద్ధమైన బండరాళ్లపైనే ఆకులు, పాత్రలు లేకుండా భక్తులు భోజనాన్ని బండరాళ్లపై వడ్డించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించడం ఈ ఆలయ ప్రత్యేకమైన భక్తి సంప్రదాయంగా ఉండేదని పూర్వీకులు చెబుతారు.

**వరప్రదుడైన స్వామివారు..**

సంతాన ప్రాప్తి, వివాహం, సౌభాగ్యం, ఐశ్వర్యం, ఆరోగ్యం, సుఖశాంతులు మరియు కోరిన కోరికలు నెరవేరాలని భక్తులు స్వామివారిని భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తారు. భక్తుల విశ్వాసానికి, మొక్కులకు, ప్రార్థనలకు బండ తిరుమలయ్య స్వామి కొంగు బంగారమై నిలుస్తారని భక్తుల నమ్మకం.

**నిజాం నవాబు పాలనలో ఆలయం శిథిలావస్థకు చేరుకుంది..**

ఒకప్పుడు ఆలయం అత్యంత వైభవంగా వెలుగొందిన బండ తిరుమలయ్య దేవాలయం శిథిలావస్థకు చేరుకుని, దానికి తోడు సంగంబండ రిజర్వాయర్ ఏర్పడినప్పుడు మక్తల్ పట్టణం వెల్సన భీమా అంతర్భాగం ఫేజ్–2 సంప్‌హౌస్ నిర్మాణం కోసం బ్లాస్టింగ్ చేయగా, కొద్ది దూరంలో ఉన్న దేవాలయానికి పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరుకుంది. ఆలయాన్ని పునర్నిర్మాణం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను, అధికారులను పట్టణ ప్రజలు, భక్తులు ఒత్తిడి చేసినా ఫలితం లేకపోవడంతో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లోనే ఆలయంలో పూజారులు నిత్య పూజలు నిర్వహించే వారు.ఆలయ దుస్థితిని చూసి చలించిన తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి భక్తులు తీసుకెళ్లగా, సోదరుడు వాకిటి శేషగిరి పర్యవేక్షణలో ఈ దేవాలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగింది. ఆలయ పునర్నిర్మాణంతో బండ తిరుమలయ్య స్వామి ఆలయానికి తిరిగి పూర్వ వైభవాన్ని తీసుకురావడం కోసం గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి, శనివారం ఉదయం నుంచి అభిషేకాలు, హోమాలు, ఆహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, పట్టణ మాజీ ఉపసర్పంచ్ వాకిటి శేషగిరి దంపతులు, మున్సిపల్ చైర్‌పర్సన్ మానస దంపతులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సురేష్ గుప్తా, మాజీ ఎంపీటీసీ కోళ వెంకటేష్, ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్

- నేపార్టీ బలోపేతానికి కృషి చేస్తా: శ్రీనివాస్
- నేనియామక పత్రం అందజేసిన డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** మండల పరిధిలోని మెహర్ నగర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఏర్పుల శ్రీనివాస్ యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య శనివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకుడు పాక మల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, కళ్లెం రాఘవరెడ్డి తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కబడ్డీలో 'గాయత్రి' విద్యార్థుల సత్తా

- అండర్–17 విజేతలుగా నిలిచిన విద్యార్థులు
- ఘనంగా ముగిసిన వలిగొండ మండల స్థాయి క్రీడోత్సవాలు
- క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ: పాఠశాల చైర్మన్
- విజేతలకు యాజమాన్యం అభినందనలు



**తొలివెలుగు, వలిగొండ :** వలిగొండలో నిర్వహించిన మండల స్థాయి పాఠశాలల క్రీడోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. అండర్–17 కబడ్డీ పోటీల్లో స్థానిక గాయత్రి స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేత క్రీడాకారులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ.. క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక క్రమశిక్షణ పెంపొందుతుందని తెలిపారు. చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కబడ్డీలో విజేతలుగా నిలిచిన ముక్కాముల విగ్నేష్, గూడూరు జస్వంత్‌రెడ్డి, గరిసే మణిశంకర్, గర్దాస్ నితీష్, పొన్నాల తరుణ్‌రెడ్డి, దోమల శివకుమార్, రాపోలు సాత్విక్, మార్క ప్రేమ్‌కుమార్, ఎండీ సోహెల్, కంకల అఖిల్‌కుమార్‌లను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పడమటి మురళీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భీమిడి యాదిరెడ్డి, ప్రిన్సిపాల్ కొంతము బిక్షపతిగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలకూర వెంకటేష్‌గౌడ్, భీమిడి కవితారెడ్డి, జక్క నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో టౌన్ ప్లానింగ్ అధికారి మృతి

**శేరిలింగంపల్లి :** టౌన్ ప్లానింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న పోస్నెట్ దినకర్ (35) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లగండ్ల ఫ్లైఓవర్ సమీపంలో జరిగింది. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ టౌన్ అధికారి దినకర్ పటాన్‌చెరు జేపీ కాలనీలో నివాసం ఉం టున్నా రు. వ్యక్తిగత పనిమీద తన స్కూటీపై నల్లగండ్లకు వెళ్లాడు. తిరిగి వస్తుండ గా నల్లగండ్ల వద్ద స్కూటీ అదుపు తప్పి కిందపడడంతో దినకర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి సోదరుడు శుభాకర్ చార్లెస్ ఫిర్యాదు మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రావు తెలిపారు.



# తల్లి మృతి.. గంటల్లోనే కుమారుడి బలవన్మరణం

**దుండిగల్ :** దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బౌరంపేటలో మహిళ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటనతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లి మరణాన్ని తట్టుకోలేక మనస్తాపానికి గురై సొంత గ్రామంలో కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే మెదక్ జిల్లా, పెద్దశంకరంపేట మండలం, ఎం.లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన శివయ్య, బేతమ్మ (42) దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కార్తీక్ (17). పెద్ద కుమార్తెకు వివాహం కాగా, కొడుకు కార్తీక్ కూకట్‌పల్లిలోని హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. చిన్న కుమార్తె సైతం ఓ హాస్టల్‌లో ఉంటుంది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం దంపతులిద్దరూ బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి దుండిగల్ సర్కిల్ పరిధి బౌరంపేటలోని బొడ్డాయి సమీపంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు. శివయ్య చెరుకు బండిని సైతం నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం చెరుకు బండి విషయమై శివయ్య బయటికి వెళ్లగా, మధ్యాహ్నం ప్రాంతంలో అతని భార్య బేతమ్మ పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. ఈ విషయమై దంపతుల ఇరువురి మధ్య వివాదం తలెత్తింది. మనస్తాపానికి గురైన బేతమ్మ శుక్రవారం మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో తాముంటున్న గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

# అబ్రహం మాతృమూర్తికి నివాళి

- అనారోగ్యంతో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి తల్లి కన్నుమూత
- పరామర్శించిన ప్రజా గాయని వేములు పుష్ప, కాంగ్రెస్ నేతలు



**తొలివెలుగు, రామన్నపేట:** జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి, రామన్నపేట పట్టణానికి చెందిన కొత్తపల్లి అబ్రహం మాతృమూర్తి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రజా గాయని, ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వైస్ చైర్మన్ వేముల పుష్ప రామన్నపేటలోని అబ్రహం నివాసానికి చేరుకున్నారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అబ్రహం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబానికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న జగన్మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్, గోదాస్ పృథ్వీరాజ్, మాజీ ఎంపీటీసీలు మహమ్మద్ రేహాన్, సాల్వేరు లింగం, నాయకులు మహమ్మద్ నాసర్, కోట సుధాకర్, మహమ్మద్ అక్రమ్, గొరిగే శేఖర్, కొమ్ము శేఖర్, నకిరెకంటి సుదర్శన్, బండ లింగస్వామి, మహమ్మద్ కరీం, ఊరికే శేఖర్, కక్కిరేణి రవీందర్, రాపోలు ఉపేందర్, భైరబోయిన శోభ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.